జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

- సత్తెనపల్లి రూరల్ మండలంలో ముగిసిన సురక్ష వైద్య శిబిరాలు
- శిబిరాల్లో వైద్య సేవలు పొందిన వారి సంఖ్య 8,178 మంది
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన కేసులు 263
- శిబిరాల్లో 172 రకాల మందులు, కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు డాక్టర్ యూఎల్ఎస్ కవిత


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


తాడువాయిలో జగనన్న వైద్యకిట్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, పీహెచ్‌సీ వైద్యులు

సత్తెనపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సెప్టెంబర్ 30న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను గ్రామాల్లోనే ప్రభుత్వం అందిస్తోంది. సత్తెనపల్లి రూరల్ మండలంలో ఈ కార్యక్రమం ఈ నెల 25తో విజయవంతంగా ముగిసింది. సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 19 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముందుగానే వైద్య శిబిరాల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీవో, తహసీల్దార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 8,178 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 263 మందిని మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సల కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు వైద్యులు రిఫర్ చేశారు. ఈ శిబిరాల్లో జనరల్ ఫిజీషియన్, ఆర్థో, గైనకాలజీ, పీడియాట్రిక్, ఆప్తాలమిక్ తదితర విభాగాల వైద్య నిపుణులు తమ సేవలు అందించారు. శిబిరాల్లో 172 రకాల మందులు, ఎమర్జెన్సీ కిట్లు, ఈసీజీ పరికరాలు అందుబాటులో ఉంచారు. 11 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించారు.

ఐదు దశల్లో ...

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రభుత్వం తొలుత ఈ కార్యక్రమంపై ప్రజలకు సెప్టెంబర్ 15 నుంచి విస్తృతంగా అవగాహన కల్పించింది. వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. రెండో దశలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్ల బృందం ఇంటింటి సర్వే చేశారు. ఏడు రకాల పరీక్షలను చేసి వాటి వివరాలు ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేశారు. అలాగే ఆయా సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలతో టోకెన్‌లు ఇచ్చారు. మూడో దశలో గ్రామ సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపు నిర్వహణ తేదీకి మూడు రోజుల ముందు వలంటీర్లు, ప్రజాప్రతినిధులు మరోమారు వైద్య శిబిరాలు తేదీని, స్థలాన్ని ప్రజలకు గుర్తు చేశారు. నాలుగో దశలో షెడ్యూల్ ప్రకారం శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు సిఫారసు చేసిన రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేర్పించి అవసరమైన వైద్యం అందేలా చూశారు. ఐదో దశలో భాగంగా చికిత్స కొనసాగుతోంది. ఇన్ని దశల్లో సత్తెనపల్లి రూరల్ మండలంలో ఆరోగ్య సురక్షను విజయవంతం చేసిన పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను, మండల స్థాయి అధికారులను ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

విజయవంతం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. ఊహించని రీతిలో ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి మందులు అందించడంతో పాటు మెరుగైన వైద్య సేవల కోసం మండలం నుంచి 263 మందిని రిఫర్ చేశారు. ప్రజా ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది సహకారంతో విజయవంతం అయ్యాయి.

–జీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ, సత్తెనపల్లి

ప్రజలకు ఎంతో ఉపయోగం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి. కొందరు అనారోగ్యంగా ఉన్నా పెద్దగా పట్టించుకోలేదు. గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడంతో అన్ని రకాల పరీక్షలు చేయించుకొని వారి రుగ్మతలు ఏమిటో తెలుసుకొని ఆ మేరకు వైద్య సేవలు పొందారు. అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేశాం.

–యూఎల్ఎస్ కవిత, వైద్యురాలు, పణిదం పీహెచ్‌సీ

జగనన్న ఆరోగ్య సురక్షతో రోగాల నుంచి విముక్తి
ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలు రోగాల నుంచి విముక్తి పొందుతున్నారని ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయి సచివాలయ పరిధిలోని గ్రామాలలో గురువారం జరిగిన వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, డెంగీ, సీజనల్ జ్వరాలకు వైద్య పరీక్షలు నిర్వహించి కావలసినవారికి జగనన్న వైద్య కిట్స్ పంపిణీ చేశారు. మొత్తం 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని వైద్యశాలలకు 8 మందిని రిఫర్ చేశారు. 110 మందికి కంటివైద్య పరీక్షలు నిరవహించి 87 మందిని కళ్లజోళ్ల కోసం ఎంపిక చేశారు. వైద్య పరీక్షలు చేసిన వారిలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు ఎస్.ప్రేమ, ఎస్.గిరిరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా సీతాభాయ్, మాజీ సర్పంచ్ అనుముల వెంకటేశ్వరరావు, లీడ్‌కాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వి.విజయ, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, సీహెచ్ఓ శివనాగేశ్వరి, హెచ్ఈ పార్వతి, హెచ్ఎస్ రాధాకృష్ణ, రామకోటమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో వైద్య శిబిరాల ద్వారా సేవలు పొందిన వారి వివరాలు...

సచివాలయం	ఓపీ	రిఫర్	ల్యాబ్ టెస్టులు	నేత్ర పరీక్షలు	కళ్ళజోళ్ళు పంపిణీ	కాటరాక్ట్‌కు రిఫర్
పెద్దమక్కెన	321	06	484	116	98	15
నందిగామ-1	436	11	741	70	58	06
గుడిపూడి	423	33	741	98	78	14
నందిగామ-2	396	25	713	104	78	11
భీమవరం	376	36	704	80	68	19
కంటిపూడి	413	09	702	120	104	12
అబ్బూరు	548	15	801	118	99	10
కొమెరపూడి	573	08	795	137	102	07
పణిదం-2	385	12	644	108	88	12
లక్కరాజు గార్లపాడు	405	13	806	90	69	12
భట్లూరు	423	06	734	84	64	16
ధూళిపాళ్ల	575	13	633	143	112	11
కట్టమూరు	420	14	726	118	88	12
బృగుబండ	425	14	615	135	89	12
రెంటపాళ్ళ	523	15	842	114	83	15
కందులవారి పాలెం	424	15	842	111	88	13
పాకాలపాడు	527	12	704	105	89	07
కంకణాలపల్లి	585	06	785	96	77	14
మొత్తం	8,178	263	13,012	1,947	1,532	218

కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే శంకరరావు


వెంకటసుబ్బమ్మ చిత్రపటానికి నివాళులు ర్పిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని పలు గ్రామాలలో కార్యకర్తలను, నాయకులను పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు గురువారం పరామర్శించారు. తొలుత లేమల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కట్టెపోగు బుజ్జి భార్య చిన మేరమ్మ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను, కర్లపూడి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన ఆరుద్ర కోటేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉంగుటూరు గ్రామ ఎంపీటీసీ కోయ వెంకాయమ్మ భర్త కోయ లక్ష్మీప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను, మండెపూడి గ్రామంలో జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోటహరిబాబు తల్లి వెంకటసుబ్బమ్మ ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కోట హరిబాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. పెదకూరపాడు మండలం కంభంపాడు వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లపాటి శ్రీనివాస రావు తండ్రి శేషయ్య మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరి వెట్టి హనుమంతరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని అందుగల కొత్తపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో పాటు ప్రభుత్వం తరపున రూ.5 వేలు, గ్రామ వైఎస్సార్ సీపీ తరపున రూ.5 వేలు, ఎమ్మెల్యే సొంతంగా మరో రూ.5 వేలు మొత్తం రూ.15 వేలు ఒక్కొక్క కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, తహసీల్దార్ కిరణ్ కుమార్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు దొడ్లేరు-1లో జగనన్న ఆరోగ్య సురక్ష

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు-1 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో బి.మహేష్ గురువారం తెలిపారు. ఉదయం పదిగంటల నుంచొ సచివాలయం-1 ఆవరణలో క్యాంప్ జరుగుతుందని తెలియచేసారు. స్పెషలిస్టువైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేస్తారని చెప్పారు. కావున దొడ్లేరు గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఎంపీడీవో కోరారు.

దూరవిద్య పోస్టర్లు ఆవిష్కరణ



క్రోసూరు: క్రోసూరు విద్యావనరుల కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) అడ్మిషన్ల గురించి వివరించే పోస్టర్లను ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దూరవిద్యా విధానం ద్వారా పదవతరగతి, ఇంటర్‌మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. పదవ తరగతికి బడిమధ్యలో మానేసిన వారు, పదవ తరగతి ఫెయిల్ అయి 14 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. మహిళలకు, పలు వృత్తి, వ్యాపార రంగాలలో ఉన్నవారికి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి సువర్ణ అవకాశం అన్నారు. ఇంటర్‌మీడియట్‌కు 15 సంవత్సరాలు నిండి ఉండి, పదవ తరగతి పాసైన వారు అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు జెడ్పీ పాఠశాల హెచ్ఎం ప్రభాకరరావు, ఏఈ సెంటర్ కో ఆర్డినేటర్ చిల్కా సురేష్‌బాబు, క్రోసూరు మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



సత్తెనపల్లి: రామాయణ గ్రంథకర్త వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వాల్మీకి బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎద్దులదొడ్డి శ్రీనివాస రావు అన్నారు. ఈ నెల 28న వాల్మీకి మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని వ్యవసాయం మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావుకు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎస్ఎం ఇస్మాయిల్, హెడ్ గుమస్తా కాంతారావు, వాల్మీకి యువజన సంఘ నాయకులు మల్లా వెంకయ్య, నల్లబోతుల శ్రీను, మల్లా గోపి, మల్లా నాగరాజు, మైలా రామారావు, నల్లబోతుల వెంకటేశ్వరరావు, కన్నెగంటి హనుమంతరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రెంటచింతల: గురజాల మండలం అంబాపురం గ్రామం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన ఘటన చోటుచేసుకుంది. రెంటచింతలకు చెందిన చదలవాడ శ్రీనివాస రావు మరో వ్యక్తిలో కలిసి పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అంబాపురం గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు అయ్యాయి. శ్రీనివాసరావును అతని స్నేహితుడు ఇంటికి తీసుకుపోయాడు. గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఇప్పటికీ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు అతని స్నేహితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నారు.

పోషకాలు అందాలి

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో నీటి సౌకర్యం లేని రైతులు మొక్కకు అవసరమైన పోషకాలను పైపాటుగా పిచికారీ చేయాలని ఉద్యాన శాస్త్రవేత్త రజిని తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలోని ఉద్యాన పంటలను గురువారం పరిశీలించారు. మొక్కలకు పైపాటుగా పోషకాలు అందించడం ద్వారా అది మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, గ్రామ సర్పంచ్ దాసరి శ్రీనివాస రావు, ఉద్యాన సహాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ

వినుకొండ(నూజెండ్ల) : ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలోభాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ప్రతి రోజూ మజ్జిగ, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు సరిపడా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 54 మందికి బీపీ పరీక్షలు, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ఈ-క్రాప్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ


ముసాయిదా జాబితాను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు


ఈ-పంట నమోదు ముసాయిదా వివరిస్తున్న క్రోసూరు ఏవో వేణుగోపాల్


మన్నెసుల్తాన్‌పాలెంలో జాబితా ప్రదర్శిస్తున్న ఏవో కృష్ణయ్య

నకరికల్లు: మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ 2023కుగాను 5,879 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామ సచివాలయంలో సామాజిక తనిఖీకి ఈ క్రాప్ బుకింగ్ ఖరీఫ్ 2023 ముసాయిదా జాబితా ప్రదర్శనను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5,879 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేయగా 94.27శాతం ఈ కేవైసీ పూర్తిచేశారన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జాన్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల ముసాయిదా ప్రకటన

క్రోసూరు: క్రోసూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల వివరాల ముసాయిదా ప్రకటించినట్లు ఏడీఏ హనుమంతరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ వివరిస్తూ డివిజన్‌లోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం, అమరావతి మండలాల్లో ఖరీఫ్ 2023 సీజన్‌లో 73,695 ఎకరాల్లో సాగు బడి, ఈ-పంట నమోదు జరిగినట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-పంట నమోదు వివరాలతో కూడిన ముసాయిదా రైతుల సామాజిక తనిఖీ కొరకు ప్రకటించటం జరిగిందన్నారు. కావున రైతులు తమ తమ రైతు భరోసా కేంద్రాల వద్ద ఉంచిన ముసాయిదాలో వివరాలు చదువుకోవాలని కోరారు. వాటిలో ఏమైనా అభ్యంతరాలుంటే అక్కడే రాత పూర్వకంగా వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోలకు అందచేయాలన్నారు. సవరణకు ఇదే ఆఖరి అవకాశమని చెప్పారు. తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు చేయబడవని వివరించారు.

ఆర్బీకేలలో ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శన

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ 2023 ఈ-పంట నమోదుకు సంబంధించి రైతుల ముసాయిదా జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం గురువారం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ గ్రామాలలో పంట నమోదు జాబితా ప్రదర్శనపై గురువారం గ్రామ సభను నిర్వహించామన్నారు. రైతులు నమోదు చేసుకున్న పంటలు, నీటి వసతి, పంట నాటిన తేదీలతో సహా పూర్తి వివరాలను గ్రామ సభలలో రైతులకు వివరించామన్నారు. పంట నమోదులో సవరణలు ఉన్నట్టయితే రైతు భరోసా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి సరిచేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మాజీగూడెం గ్రామంలో ప్రత్తి పైరులో పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం వెంకట నరసమ్మ, రమణారెడ్డి, దరియా, సిరిపురం మేస్త్రీ, సిబ్బంది సాయికిరణ్, శ్యాంప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లో 42,700 ఎకరాలకు ఈ కేవైసీ

సత్తెనపల్లి: ఖరీఫ్-2023కు సంబంధించి సత్తెనపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 45,649 ఎకరాలలో పంట నమోదు చేయగా 42,700 ఎకరాలకు (93.5 శాతం) ఈ-కేవైసీ చేయటం జరిగిందని సత్తెనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు యస్ శ్రీధర్ రెడ్డి చెప్పారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్‌కు 22,354 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 20,574 ఎకరాలకు ఈ-కేవైసీ చేయించామన్నారు. పెదకూరపాడు మండలంలో 18,054 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 17,094 ఎకరాలకు, ముప్పాళ్ల మండలంలో 5,241 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 5,032 ఎకరాలకు ఈ కేవైసీ చేయించామన్నారు. మొత్తం ఖరీఫ్ 2023 సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు అయిన పంటల వివరాలు ముసాయిదా జాబితాలను ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు సబ్ డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శిస్తామన్నారు. రైతులు సామాజిక తనిఖీలో భాగంగా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కొరకు రైతు భరోసా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి త పూర్వకంగా తెలియ జేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ నకు సంబంధించి ఇదే ఆఖరి అవకాశమని తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు ఉండవన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరిలో సస్యరక్షణ చేపట్టాలి


నకరికల్లులో వరిపొలాల్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

నకరికల్లు: వరిపైరు సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోవడం ఆకుచుట్టు పురుగుగా గుర్తించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. నకరికల్లులోని వరిపొలాలను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో దుబ్బుకి 20 చొప్పున దోమలు కన్పిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం తొలిదశలో ఉందని అన్నారు. దోమలు మొక్కలోకి రసం పీల్చడం వలన పైరు లేత పసుపు రంగులో మారుతుందని అన్నారు. తొలి దశలో దుబ్బుకి 20-25 దోమలు ఉన్నట్లు గుర్తించినపుడే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బుప్రోఫెజిన్ 1.6ఎంఎల్ లేదా పైమెట్రోజైన్ 0.6గ్రాములు లేదా ట్రైఫ్లూమీజోపైరిమ్ 0.48ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.సుభాని, యడవల్లి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో టీడీపీ చిచ్చు


గొట్టిపాళ్ళ గ్రామం


వెల్దుర్తి: ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో తెలుగు దేశం పార్టీ నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు చిచ్చు పెట్టి ఘర్షణలకు తెరలేపుతున్నారు. మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తుంటే టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు ఆగస్టు 29న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి నలుగురు కార్యకర్తలను తీవ్రంగా గాయపరిచారు. గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామం మొత్తం వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. ఇది ఓర్చుకోలేని టీడీపీ పల్లెలో ఏదో జరుగుతుందని వైఎస్సార్ సీపీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కూడా గ్రామంలోనే ఉండి పంటలు సాగు చేసుకుంటున్నప్పటికీ అనవసర దుష్ప్రచారం చేస్తున్నారు. గ్రామం ప్రశాంతంగా ఉండేందుకు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెటింగ్ పెట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో ఆరు పూరిళ్లు దగ్ధం


ప్రమాదంలో కాలిబూడిదైన ఇళ్లు

బొల్లాపల్లి: విద్యుదాఘాతం సంభవించి 6 తాటాకు పూరిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పుతోల శ్రీను పూరిగుడిశెలో విద్యుదాఘాతమై మంటలు వ్యాప్తి చెందాయి. పక్కనే ఆనుకొని ఉన్న త్రిమూర్తి, చిన్న అంకమ్మరావు, గుంజి అజిత్, వేముల కొండలరావు, గుంజి శ్రీనులకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుతోల శ్రీను గుడిశెలో రూ.3 లక్షల నగదు, చిన్న అంకమ్మరావుకు చెందిన రూ.80 వేలు మంటల్లో కాలి బూడిదయ్యాయని బాధితులు బోరున విలపించారు.ప్రమాదం సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో రెండు గ్యాస్ సిలెండర్లు పేలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం మేరకు అగ్నిమాపక వాహనం సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఉపాధ్యాయుల పాత్ర అపారం


ఆలోకం లక్ష్మీతులసీని సత్కరిస్తున్న హెచ్ఎంలు

యడ్లపాడు: పాఠశాల ప్రగతి..విద్యార్థుల ఉన్నతిని కాంక్షించినపుడే బోధన వృత్తికి వన్నెవస్తుందని ఎంఈఓ 1,2 నాగరత్నం, ఎన్ అరుణకుమారి చెప్పారు. మండలంలోని కొండవీడు యూపీ పాఠశాలలో గురువారం హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన జాలాది గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయిని ఆలోకం లక్ష్మీతులసీ సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత లక్ష్మీతులసీని సత్కరించారు. పాఠశాల హెచ్ఎం జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు జి విజయభారతి, సుగంధరావు, కేవీ రామిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.